


సూర్యుడికి వృద్ధాప్యం వచ్చేసింది.

ప్రొద్దున్న పుట్టి పదిగంటలకల్లా ఎదిగి, మధ్యాహ్నానికి మహారాజుగా మారిన మార్తాండుడిని సాయం సమయంలో ముసలితనం చుట్టేసింది.

అందుకేనేమో చూపుల్లో పగటి అందమూ లేదు. మధ్యాహ్నపు తీవ్రతాలేదు.

ఆలల్లా చుట్టుముట్టిన ఆలోచనల తీరుకి నవ్వుకుంది శాంతమ్మ. సూర్యచంద్రులకి వృద్ధాప్య మేమిటి ? వాళ్ళు నిత్యవసంతులు. కిటికీలోంచి చూడసాగింది.

''ఎంత అందమైనది సంధ్యాసమయం ! మరెంత ఆనందమయం !''

పగటిపూటంతా ప్రతీ ఇంట్లోనూ చచ్చేంత యాంత్రికత ఉంటుంది. ఈ సమయానికీ ఆ సమయానికీ ఎంతో తేడా ఉంటుంది. తన వయసుకీ చిన్న వయసుకీ కూడా ఎంతో తేడా ఉంది.

ప్రకృతిలోని తొందర, ప్రజలలోని తొందరా తిరుగుముఖం పట్టి నిదానంగా ఆలోచించుకునే నిముషాలివి.

పగటి అనుభవాల మూటలు విప్పి తీరిగ్గా పంచుకుంటారీవేళలో! అలాగే పసితనంలో చేసిన పెంకిపనులూ, యవ్వనంలో ఎదుర్కొన్న అనుభవాలు, అవి అందజేసిన అనుభూతులు నెమరు వేసుకుంటూ గడిపే వృద్ధాప్యపు ప్రశాంత జీవనానికి ఎందుకని ఇన్ని అవరోధాలు ?

శాంతమ్మ దృష్టి పార్కుమీదికి మళ్ళింది. వాళ్ళ ఇంటికి ఎదురుగా ఉన్న పార్కు చూస్తూ గడపడం ఆవిడ సాయంత్రపు అలవాటు.

ఎప్పటిలాగే పార్కు సందడిగా ఉంది. అందరినీ దాటి ఓ చోట నిలచిపోయింది ఆవిడ చూపు.

తెల్లగా సన్నగా పొడుగ్గా ఉన్న వ్యక్తి సిమ్మెంటు సోఫాలో కూర్చుని ఉన్నాడు. అతి పల్చటి జుట్టు వెండిరంగులో పోటీ పడుతోంది.

లోతుకుపోయిన కళ్ళు, చప్పిగా వ్రేళ్ళాడుతున్న దవడలు, కాస్త వంగిన నడుము కర్రసాయంతో అడుగులు ముందుకువేసే శరీరం ఆయన సొత్తు.

రోజూ ఈ వేళప్పుడు వచ్చి కూర్చుంటాడు అదేస్థలంలో ! చేతిలో పుస్తకం ఉంటుంది. అది ఆరంభిస్తాడు. దానితోబాటే ఆలోచనలు కూడా ఆరంభమవుతాయి కాబోలు పేజీలు త్వరగా కదలవు. ఒకోసారి అసలు మొదటి పేజీయే కదలదేమోనని శాంతమ్మ అనుమానం !

శూన్యంలోకి ఏదో వెతుకుతున్నట్లు చూడడం, ఆడుకుంటున్న పిల్లలలో తన పసితనపు జ్ఞాపకాలను పరికించడం జరిగినట్లు అనిపిస్తుంది శాంతమ్మకి !

'తనలాంటి మరో దురదృష్టవంతుడు'

దురదృష్టం ఆలోచనల్లోకి రాగానే పగటి విషయం దాని పక్కనే చేరుకుంది.

'కొడుకు తనని అపశకునం' అని కదూ అన్నాడు నవమాసాలూ మోసి కన్నందుకు ! ఆ మాటని ఊరుకున్నాడా ? ఊహు ! ఆ మధ్య ఎప్పుడో తాను ఎదురుపడినప్పుడు కార్యం సర్వ నాశనమైందని చెప్పి, వెధవముండలు వీధి వైపుకు రాకూడదు. వస్తే ఇలాగే జరుగుతుంది అన్నాడు. వాడికి వత్తాసు పలికింది కోడలు.

తన అవసరం వాళ్లకి చాలా ఉంది. పని మనిషిగా పాచీపనీ అంట్లపనితో ఆరంభమయ్యే తన దినచర్య వంటమనిషిగా కొనసాగి మళ్లీ రాత్రి అన్నీ శుభ్రం చేయవలసిన పని ఉంటుంది కనక వంట మనిషిగా వీడ్కోలు తీసుకుని పనిమనిషిగా ముగుస్తుంది.

అవన్నీ చేసినా ఫలితం పూజ్యం !

విధవకి ఉప్పుకారాలున్న తిండి పెట్టకూడ దన్న పద్ధతి తన విషయంలో ఇరవయ్యవవత్సరం రాకుండానే ఆరంభమై కొనసాగుతోంది.

కాఫీ, టీల రుచి ఎరుగదు తన నాలుక !

చిరిగి పేలికలవుతున్నాయి చీరలు. పట్టించుకునేదెవరు ? ఏ జ్వరమో వచ్చినా దిక్కులేదు. 'లంఖణం పరమౌషదం' అని పస్తుచేస్తారు. అలాగని విశ్రాంతైనా ఇస్తారా అంటే అదీలేదు.

కరువుదీరా కబుర్లాడేందుకు, కమ్మగా భోంచేసేందుకు వీల్లేదు.

అంతెందుకు ? దినపత్రిక చదివే స్వాతంత్ర్యంకూడా తనకిలేదు. చాకిరీ చేస్తూనే చావాలి. అదే తనకి మోక్షం !

"అమ్మా !"

"అమ్మా నిన్నే !"

"ఏమిటి ?" వెనక్కి తిరిగి అడిగింది శాంతమ్మ.

"పిల్లలేదో అంటున్నారు విను !" అన్నాడు కొడుకు రఘు.

పిల్లలవైపు తిరిగింది శాంతమ్మ.

"పార్కులో నీకో మగ స్నేహితుడి ఉండి ఉంటాడు అంటున్నాను బామ్మా!" కన్నుకొడుతూ చెప్పాడు ప్రవీణ్.

శాంతమ్మ నివ్వెరపోయింది.

"అందుకే ఒళ్ళంతా కళ్ళు చేసుకుని అలా చూస్తూంటావని అన్నాడు. సెంట్ పర్సెంట్ కరెక్ట్ అన్నాను నేను." అన్నాడు కొడుకు.

కొడుకూ,కోడళ్ళవైపు చూసింది శాంతమ్మ.

కొంగుచాటున కిసుక్కుమంది కోడలు. పక పకా నవ్వాడు కొడుకు.

పిల్లలిద్దరినీ మందలించవలసిన ఆ తల్లి తండ్రులవైపు తేరిపారా చూసి ముఖం తిప్పుకుంది.

మగపిల్లల్ని మహారాజుల్లా పెంచడం ఆ ఇంటి పద్ధతి. అధికారం చెలాయించడం, చిన్నంతరం, పెద్దంతరం అన్నది లేకుండా ప్రవర్తించడం వస్తొందేతప్ప చదువూ సంధ్య లలో కళాకాంతుల్లో సంస్కారంలో మాత్రం ఎదుగుదల రావడంలేదు ఆ మహారాజులకి !

"తప్పు వాళ్ళది కాదు నీది." అంది కొడుకుతో అతి నెమ్మదిగా !

"మా ఎవ్వరిదీ తప్పుకాదు. నీదే తప్పు !" రెచ్చగొడుతున్నట్లు అన్నాడు కొడుకు.

గబగబా ఏదో పని ఉన్నట్లు పెరటివైపుకు నడిచింది శాంతమ్మ.

కన్నీళ్ళు కాల్వలు కట్టసాగాయి. కష్టం ఏదైనా వస్తే చనిపోయిన భర్త గుర్తుకు వస్తాడుట పితంతువులకి !

తనకలాకాదు. తనకి పూర్తిగా ఆ రూపమే గుర్తులేదు. ఎలా గుర్తుంటుంది ?

ఎనిమిదవ ఏటే పెళ్ళయినా పదమూడో ఏడు వచ్చేదాకా కాపురానికి పోలేదు. అత్త వారింట్లో మాత్రం ఆయన ముఖాన్ని సావధా నంగా పరికించినదెపుడు ? ఆయనగారి పలుకులు విని పరవశించినదెపుడు ? పగటిపూట ఎదుట పడకూడదు. రాత్రయినా తనతో నోరారా మాట్లాడినవేమీ లేవు. ఆయన చాలా ముభావి ! అది మాత్రం ఎన్నేళ్ళు సాగిందని ? ఇరవై ఏళ్ళకే తాను విధవ.

అసుర సంధ్యవేళ కన్నీళ్ళతో ఆలోచిస్తూ ఉండిపోయింది శాంతమ్మ.

*　　*　　*

సిమ్మెంటు సోఫాలో కూర్చుని ఆలోచనల్లోకి చాలా దూరంగా సాగిపోయిన భార్గవయ్య వెళ్ళి పొమ్మన్న హెచ్చరిక రావడంతో తప్పనిసరిగా లేచాడు.

కర్ర సాయంతో నెమ్మదిగా ఇంటివైపుకు అడుగులేసాడు.


ఆకలి అధికం కాసాగింది. అయినా ఇంటికి వెళ్ళాలని లేదు. ఇంట్లో ఏముంది కొడుకు కోపం, కోడలి రుసరుసలు, మనవల సణుగుడు తప్ప !

ముసలివాళ్ళు పసివాళ్ళతో సమాన మంటారు. అందుకే కాబోలు తనకి కోరికలు కలుగుతున్నాయి. ఏవేవో తినాలని, చూడాలని ఎవరితోనైనా కబుర్లు చెబుతూ కూర్చోవాలని!

తన స్నేహితులెవరైనా ఇంటికి వస్తే వాళ్ళని అనరాని మాటలని అతిగా అనందిస్తారు. అలా చేస్తే ఎవరు మాత్రం గుమ్మం తొక్కుతారు ? వాళ్ళ ఇంటికి తాను ఏ ముఖం పెట్టుకుని వెడతాడు ?

ఏదైనా వండిపెట్టమంటే వినదు కోడలు. పోనీ తనే కొనుక్కుని తిందామా అంటే డబ్బు ఉండదు. ఓ రోజు ధైర్యంచేసి పెన్షన్‌గా ఆ పూటే వచ్చిన పచ్చకాగితాలలో ఒకదాన్ని ఖర్చుచేసి తృప్తితీరా భోంచేసి, నాగయ్యగారి పాత సినిమా ఎక్కడో ఆడుతోందని విని, అది చూసి ఇల్లు చేరాడు.

అప్పుడు ఇంటిల్లిపాదీ ఎంత గొడవచేసారో! బుద్ధులు ముసలివి కాలేదని, 'కృష్ణారామా' అనుకుంటూ కూర్చోక పాతికేళ్ళ కుర్రాడిలా ప్రవర్తించాడని, ఇలాంటి వారుండబట్టే ఆశ్రమ





విశాఖపట్నం మేయరు శ్రీ ఎన్. ఎస్. ఎన్. రెడ్డి 55వ జన్మదినోత్సవ సందర్భంగా శ్రీ టి. సుబ్బరామిరెడ్డి (దక్షిణ భారత సెన్సారు బోర్డు సభ్యులు) ప్రముఖ పత్రికా ఫొటోగ్రాఫరు శ్రీ వాసును సన్మానిస్తున్న దృశ్యం.

# తోడొకరుండిన...

ధర్మాలు ప్రవేశపెట్టారని అంటూ ఎంతగా సాధించారో!

తనకి పుట్టిన ఒక్కగానొక్క కొడుక్కి అన్యాయం చేయబుద్ధికాక, భార్య పోయినా పెళ్ళి చేసుకోలేదు తను. అప్పుడు తన వయసు నలభయ్యే! తను ఊ అంటే ఇరవై ఏళ్ళ పిల్లని సైతం ఇవ్వడానికి ఎందరో పెద్ద మనుష్యులు సిద్ధంగా ఉన్నారప్పుడు.

ఆలోచనలు వేగంగా సాగుతున్నాయి.

అడుగులు నిదానంగా పడుతున్నాయి.

ఇల్లుచేరి తలుపు తట్టాడు పరధ్యానంగా! జవాబులేదు. మరోసారి ప్రయత్నించినా ఫలితం రాలేదు.

ఆశ్చర్యంగా తలుపు వైపు చూసాడు. పెద్ద తాళం కప్ప వేళ్ళాడుతోంది.

ఎంత ఆలోచించినా ఎటు వెళ్ళివుంటారో అంతుపట్టలేదు.

ఎన్ని నిముషాలను నిశిరాత్రి బలిగొందో!

ఎప్పటికో అంతా ఇల్లు చేరారు.

"మీరు వెడుతున్నట్లు నాకు చెప్ప లేదేంరా?" కొడుకుని ఉద్దేశించడిగాడు.

"నిన్న నేను చెప్పాను కదా! మీరు తల ఊపారు కూడాను! ఇప్పుడు కొత్త విషయంలాగ మాట్లాడతారేమిటి?" అంది కోడలు.

"నువ్వు చెప్పావా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అంటే మీరు వినలేదన్నమాట!"

"వినే ఉంటానమ్మా! పెద్దవాడిని కదా మరచిపోయానేమో!"

"చూసారా ఎలా అంటున్నారో! నా మాటలు ఆయన మరచిపోగాలేనిది ఆయన అవ సరాలు మాత్రం నేను ఎందుకు మరచిపోకూడదో అడగండి."

భార్గవయ్య పొడిగించలేదు.

సినిమాకి వెడితే హోటల్లో భోంచేసి వస్తారు. వెళ్ళాలని నిర్ణయించుకున్న రోజున ప్రొద్దున్నే ఓ గుప్పెడు బియ్యం ఎక్కువగా పోస్తుంది కోడలు. ఇవాళలిలాగే చేసినట్లుంది మేకుల్లా ఉన్నాయి మెతుకులు. ఏదో కతికాననిపించాడు.

రోజూ ఆఖరున భోంచేసేది ఆపైన వంట గది సర్దేదీ ఆయనే! ఇవాళ కూడా ఆ పని పూర్తి చేసి పక్క ఎక్కాడు.

బజారుపనులు మునుపటిలాగ ఓపికగా చేయలేకపోతున్నాడు. అయినా కోడలు ఊరుకోదు. రేషన్ క్యూలోనూ, ఎలక్ట్రిక్ బిల్, వాటర్ బిల్ వగైరాలు కట్టడంలోనూ ఆయన రోజులు గడిచిపోతున్నాయి. ఓపికలేదన్నా కోడలు విడిచిపెట్టదు. కూరగాయలు హోల్‌సెల్ మార్కెట్‌నుండే తేవాలి. పప్పులూ వగైరాలు సూపర్ బజార్ నుండి! ఇలాంటి బాధ్యతలన్నీ ఆయన్ని శారీరకంగా అలుపుకు గురిచేస్తే, ఒంటరితనం మానసికంగా దెబ్బతీయసాగింది.

తనకి తోడు కావాలి. సేవలు చేయడానికి కాదు. సేద దీర్చడానికి! అది అసాధ్యమని తెలుసు. అందుకే నిట్టూర్చి నిద్రకు ఉపక్రమించాడు.

* * *

ఆ రోజు రాత్రి టీవీలో పాలూ చేలూ కార్యక్రమం పూర్తయ్యాక 'కనబడుటలేదు' అన్న ప్రకటనలు చెబుతూ ఫొటోలు చూపించారు. అందులో ఓ అయిదేళ్ళ పిల్లాడి వివరణ అయ్యాక ఓ ఫొటో చూపించి క్రింది విధంగా తెలియజేసింది అనౌన్సర్.

"ఈ ఫొటోలోని వ్యక్తి పేరు భార్గవయ్య. ఇతను ఈ నెల తొమ్మిదవ తేదీ నుండి కనబడటంలేదు. పచ్చని శరీరఛాయ. సన్నగా పొడుగ్గా ఉంటాడు. నడుము కొద్దిగా వంగింది. వయసు డబ్బై సంవత్సరాలు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలను అనర్గళంగా మాట్లాడగలడు. తప్పిపోయిన రోజు తెల్లటి లాల్చీ, తెల్లటి ధోవతి ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసినవారు ఈదిగువ అడ్రస్‌కి తెలియజేయండి."

* * *

తర్వాత టీవీలో వాన పడుతున్నగా గీతలు అడ్డదిడ్డంగా పడి ఆగాయి. క్షణం గడిచాక 'మన్నించాలి ప్రసారంలో అంతరాయం' అన్న స్లైడ్ చూపించారు. ఆ తర్వాత 'మూడు పువ్వులు ఆరుకాయలు' అన్న కుటుంబ సంక్షేమ సంబంధితమైన నాటిక చూపించారు. ఆ తర్వాత మరో ప్రకటన—'శాంతమ్మ అనే అరవై మూడేళ్ల స్త్రీ కనబడటంలేదు. ఆవిడ ఫొటో ఏదీ లేక పోవడంతో పంపడం కుదరలేదని తెలియజేస్తున్నారు. పొట్టిగా, సన్నగా చామన ఛాయగా ఉంటుంది. గడ్డం మీద పుట్టుమచ్చ ఉంటుంది. తప్పిపోయినరోజు తెల్లటి ధోవతి అదేరంగు రవిక తొడుక్కుని ఉంది. ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయండి.'

* * *

మర్నాడు ప్రొద్దున్న—

కాలింగ్ బెల్ మ్రోగింది.

తలుపు తీసిన శాంతమ్మ కొడుకు కొయ్యబారిపోయాడు.

శాంతమ్మ టీవీలో నిన్న చూపించిన వ్యక్తి పక్కన నిలబడి ఉంది. నుదుట రూపాయి కాసంత బొట్టు చేతుల నిండా గాజులూ తల్లో పూవులు. అన్నింటికంటె ముఖ్యంగా మెడలో మాత్రాలూ, నల్లపూసలూ కాళ్లకి మెట్టెలు. వీళ్లిద్దరి వెనకా భార్గవయ్య కొడుకు, కోడలు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శాంతమ్మ ఇంట్లోని వారు అంతా గబగబా ముందుగదిలోకి వచ్చి నోట మాట రాక నిలబడిపోయారు.

"మేమిద్దరం పెళ్లి చేసుకున్నాం!" ఆ ప్రదేశాన్ని ఆక్రమించిన నిశ్శబ్దాన్ని నరిపేస్తూ అన్నాడు భార్గవయ్య.

అంతా కూర్చున్నాక ఆరంభించాడు భార్గవయ్య.

"మీకెవరికీ నమ్మేలా లేదీ విషయం అని నాకుతెలుసు! మీకే కాదు ఏ ఇతర భారతీయుడికీ నమ్మశక్యం కాని అంశమిది!"

మేమీ నిర్ణయానికి రావడానికి ముందు చాలా రోజులే ఆలోచనల్లో గడిపాము. ఇద్దరం జీవన సంధ్యాసమయానికి చేరుకున్నాం! ఈ వయసులో తప్పనిసరిగా 'నా' అనే వ్యక్తి ఉండి తీరాలి. లేకపోతే బ్రతుకు దుర్లభమవుతుంది.

మీకు మరీ అంత కష్టం ఏమొచ్చింది? అంటారేమో! అది అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది. భార్యపోయి చాలా ఏళ్ళే అయింది నాకు. భర్తపోయి శాంతమ్మకి చాలా ఏళ్ళే జరిగాయి. అప్పుడులేని అవసరం ఇప్పుడు అధికంగా కనబడడంతో ఈ పనికి తలపడ్డాము.

# ధర్మపథం

— బులుసు వేంకటరమణయ్య



## అష్టకష్టములు

తనకు కష్టమైన పనులను గురించి చెప్పుతూ ఒక కవి, ఎన్నడో వ్రాసిన చాటు పద్యం ఒకటి ప్రసిద్ధంగా ఉన్నది– ''శీతజల స్నానం బును, భూతల శయనంబు పూటశనంబున్– నాతిగల బ్రహ్మచర్యము, నా తరమా రావువారి నౌకరిసేయన్'' అనేదే ఆ పద్యం. అతనికి క్షష్టసాధ్యాలయితే కావచ్చును కాని, వీటిలో చాలావరకూ కష్టాలని అనపించవు. అలవాటు పడిన వారికి వేన్నీళ్ళకంటె చన్నీళ్ళే బాగు అని పిస్తాయి. చల్లని నేలపైని పడుక్కోవడం కొందరికి చాలా ఇష్టం. అంచేత ఇలాటివాటిని కష్టాలకింద లెక్కించరు.

అనేక విధాలుగా శ్రమపడుతున్న వానిని చూచి ''పాపం ! అతడు అష్టకష్టాలూ పడు తున్నాడు'' అని జాలిపడడం సర్వ సాధారణం. ఆ యెనిమిది కష్టాలూ ఏవో తెలుసుకోవాలని చాలామందికి ఉంటుంది. అవి– దేశాంతర గమనం, భార్యా వియోగం, కష్టకాలంలో బంధువులను చూడడం, ఉచ్ఛిష్టం తినడం, శత్రువులతో స్నేహం, ఇతరుల తిండికయి ఎదురుచూడడం, మోసపోవడం, దారిద్ర్యం అనేవి. కొందరి అభిప్రాయం ప్రకారం–ఇతరు లను సేవించడం, లేమి, భార్యను విడిచి ఉండడం, స్వయంగా వ్యవసాయం చెయ్యడం, ఇతరులను యాచించడం, ఋణం చెయ్యడం, అడిగినవారికి లేదని చెప్పడం, దారిలో ఒంటరిగా నడచిపోవడం – అనేవి అష్టకష్టాలు. మరి కొందరి మతంలో ఋణం చెయ్యడం, ఇతరు లను యాచించడం, ముసలితనం, జారత్వం, దొంగతనం, దారిద్ర్యం, రోగం, ఉచ్ఛిష్టం అష్టకష్టాలు.

ఎవరు ఏవిధంగా చెప్పినా, పయిని చెప్పిన వన్నీ కష్టాలనే అనుభవజ్ఞులకు తెలియకపోదు. దారిద్ర్యం ఎంత కష్టమైనదో, ఋణబాధ మానవులను ఎలా పీడిస్తూ ఉంటుందీ, ఇతరు లను యాచించడం ఎంత హీనమో, జారత్వం, చోరత్వం మానవుణ్ణి ఎంత హీనుడిగా చేస్తాయో తెలియనివారుండరు. పైవాటిలో ఒక్కొక్కటే ఎంతో కష్టాన్ని కలిగిస్తుంది. అట్టిస్థితిలో ఇవి గుంపుగా చేరితే మానవుడి సంగతి ఎలా ఎంటుందో ఊహాతీతం. అందు వల్ల వీని అన్నింటినీ తన శత్రువులుగా భావించి వీటికి దూరంగా ఉండడానికి సర్వవిధాలా ప్రయత్నించాలి.

మీరు, మనవలూ పదే పదే ఏడిపించటానికి శాంతమ్మని అన్నమాటలే ఆవిడని ఆలోచింప చేసాయి.

ఇక నా విషయానికి వస్తాను'' అంటూ కొడుకూ కోడలు, పిల్లల వైపు చూసాడు. అన్నట్లు మీకు పరిచయం చేయనేలేదు కదూ ! వీళ్ళు నా కొడుకూ, కోడలు, పిల్లలూ ! సరే వినండి నాగోడు ! తోడు కావాలని తపించిన నా మనసు నాలాంటి మరో మనస్సును చాలా తేలిగ్గా గుర్తించింది. పార్కులో కూర్చునే ఎన్నోసార్లు ఆవిడని పరికించాను. పదే పదే కళ్ళు తుడుచుకుంటూ ఉండేది. ఆవిడ వృద్ధ మనసుని నా వృద్ధమనసు అర్థం చేసుకుంది.

ఇద్దరం అలా చాలాసార్లు పరిశీలించు కున్నాం ! ఆ తర్వాత ఎప్పుడో అనుకోకుండా గుడిలో కలుసుకుని గుండెలు విప్పుకున్నాం !

నేను ఆవిడతో మాట కలపడానికి ఎంత అవస్థపడ్డానని ? పాతికేళ్ళ యువకుడు కూడా నేను పడిన పాట్లుపడి ఉండడు.

తను గుడికి రావడం ఎలా గగనమవుతోందో ఆవిడ వివరించిన తీరుకి విస్తుపోయాను. అరవైఏళ్ళ ఆవిడకి అన్ని కఠిన నిబంధనలున్నా యని, అవి పాటించకపోతే ఫలితాలు తీవ్రరూపాన్ని దాలుస్తాయని విన్న తర్వాత అనిపించింది నేను పడుతున్న బాధ ఆవిడ బాధ ముందు. చాలా చిన్నదని !

సంకోచిస్తూనే చాలా కాలం స్నేహంగా గడిచాక వివాహ ప్రసక్తి తీసుకు వచ్చాను. 'ససేమిరా' అంది శాంతమ్మ. చాలాసార్లే ఆ విషయంలో విఫలమయ్యాను. ఓ రోజు తనంట తానే ఆ ప్రసక్తి తెచ్చింది ఆ రోజు ఆవిడ ఎలా ఉందని చెప్పను ? నీటికుండలా ఉంది. 'చాలా భయంకరమైన అవమానం జరిగింది' అంది. నేను రెట్టించి బాధ పెట్టదలచుకోలేదు.

ఆవిడ సుముఖంగా ఉందని సంతోషించాను. ఆలస్యం చేయక ఆ రోజే ఆ పూటే పెళ్ళి చేసు కున్నాం ! మంచి రోజో కాదో ఆలోచించలేదు. అసలు ఇంకేమీ ఆలోచించలేదు. ఆలోచిస్తే ఏముంది ? అన్నివైపులా మాకు అవరోధాలేగా కనబడేది !

అంతా వినండి ! వయసులో ఉన్న యువకులకి పెళ్ళి చేయాలని త్వర పడతారు అంతా ! అది మంచిదే ! ఏ తప్పటడుగు వేయక ముందే జాగ్రత్త పడడం అవసరం !

కానీ మా వయసు అలాంటిది కాదు. ఈ వయసులో తప్పనిసరిగా తోడుకావాలి లేకపోతే బ్రతుకు దుర్లభం !

అందుకే మేమీ పనిచేసాము !

పరువు ప్రతిష్ఠల పేరిటో, లజ్జ ఆవహించో, పిల్లలేమనుకుంటారో అని నేను వెనకంజవేయలేదీ విషయంలో ! కనీసం పుస్తకాల్లో కూడా ఈ రకమైన వివాహ ప్రసక్తి కనబడదు. నేను చెప్పేది మనదేశం గురించి మాత్రమే !

ఏమైతేనేం ఇంక నాకు కర్ర అవసరం లేదు. రుచులకి ముఖం వాచనక్కరలేదు. మాట్లాడే మనిషి కోసం తపించిపోయే పనిలేదు'' అన్నాడు భార్గవయ్య.

'అడుగడుగునా అవమానాలు, ఆంక్షలు ఇక నన్ను పీడించవు. శకునం ప్రసక్తే లేదు. నా విలువ నాకుంటుంది' అని శాంతమ్మ చెప్పలేదు. ఆవిడ కళ్ళే ఆ విషయం వివరించాలని తెగ తాపత్రయపడుతున్నాయి.

వింటూ కూర్చున్నవాళ్ళకెవరికీ మాటలు దొరకలేదు.

'ఆశలు తీరని ఆవేదనలో
ఆశయాలలో ఆవేశములో
చీకటి ముసిరిన ఏకాంతంలో
నీ వ్యధ తెలిసి
నీడగా నిలిచే
తోడొకరుండిన
అదే భాగ్యమూ అదే స్వర్గము'

వినిపిస్తోంది సినిమా పాట పక్కవాళ్ళ రేడియోనుండి, అక్కడి వ్యక్తులందరినీ ఆలోచింపచేస్తూ ! ★